## క్లుప్తంగా

### విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



జగనన్న కాలనీలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**కోవెలకుంట్ల:** స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని అధికారులు శుక్రవారం పరిశీలించారు. తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఐ రంజిత్, ట్రాన్స్‌కో ఏఈ అనంతరావు, తదితరులు పట్టణ శివారులోని కోర్టు వెనుక ఉన్న జగనన్న కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కావాల్సిన స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని తహసీల్దార్ పేర్కొన్నారు.

### వేడుకగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన



ఆలయంలో ప్రతిష్టిస్తున్న ధ్వజస్తంభం

**బనగానపల్లె రూరల్:** మండలంలోని పలుకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్టాపన వేడుకగా జరిగింది. పురోహితుడు గురుమూర్తిశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఉదయం 8:30 గంటలకు ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. మధ్యాహ్నం వేంకటేశ్వరస్వామి విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు. కాగా శనివారం స్వామివారి విగ్రహ ప్రతిష్ట జరగనుంది.

### కల్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ



నందవరంలో భూమి పూజ చేస్తున్న మంత్రి బీసీ

**బనగానపల్లె రూరల్:** నందవరం చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద రూ.3 కోట్లతో నిర్మించనున్న కల్యాణ మండపానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. అంతకు ముందు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే గ్రామంలోని గొల్లపేట కాలనీలో ఎన్‌ఆర్‌జీఎస్ రూ.20 లక్షలు, డీఎంఎఫ్ రూ.40 లక్షల నిధులతో నిర్మించిన సీసీరోడ్డు, డ్రైనేజీ కాలువలను ప్రారంభించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఎంపీడీఓ వెంకటరమణ, పీఆర్ ఏఈ రమణ, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి, వెంగన్న పాల్గొన్నారు.

### సీతారామాపురానికి చేరుకున్న కృష్ణా జలాలు

**బేతంచెర్ల:** మెగా వాటర్ గ్రిడ్ పథకం లక్ష్యం పూర్తి స్థాయిలో నెరవేరబోతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్న డోన్ నియోజకవర్గానికి కృష్ణాజలాలను అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించారు. మండల కేంద్రమైన బేతంచెర్ల పట్టణంతో పాటు ఆయా గ్రామాలకు మొదటి విడతలో ఈ పథకం కింద గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. రహదారి పనుల వల్ల సీతారామాపురం గ్రామానికి చెందిన పైపులైను వేయలేదు. ఇటీవల రహదారి పనులు పూర్తి కావడంతో పైపులైను వేసి గోరుకల్లు నీటిని గ్రామానికి తరలిస్తున్నారు. అక్కడ నుంచి మరో 5 గ్రామాలకు గోరుకల్లు రిజర్వాయర్ నీటిని అందించడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు గ్రామానికి కృష్ణా జలాలు చేరడంతో గ్రామస్తులు పూజలు చేపట్టారు.

### చౌడేశ్వరిదేవికి పల్లకీ సేవ

**బనగానపల్లె రూరల్:** నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, నేవేద్యం సమర్పించి మంగళహారతులు ఇచ్చారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని ఆలయ ప్రాకారంలో ఊరేగింపు నిర్వహించారు.

# కూటమి కక్ష.. పేదలకు శిక్ష

**కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో వరుసగా షాక్‌లు ఇస్తోంది. ఇప్పటికే రేషన్ సరుకులను కుదించి పేదల పొట్ట కొడుతోంది. తాజాగా కార్డుదారులకు సౌలభ్యంగా ఉన్న ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానాన్ని రద్దు చేసింది. రేపటి నుంచి (జూన్ 1వ తేదీ) చౌక దుకాణాల వద్దే రేషన్ సరుకులు పంపిణీకి సిద్ధమవడంతో కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు మంచి చేయాల్సింది పోయి రాజకీయ కక్షతో ఉన్న వాటిని రద్దు చేయడం సరికాదని పేర్కొంటున్నారు.**

- ఇంటింటి రేషన్ విధానం రద్దు
- రేపటి నుంచి చౌక దుకాణాల వద్దే రేషన్ పంపిణీ
- ఉపాధి కోల్పోయిన ఎండీయూ ఆపరేటర్లు
- ప్రజలకు తప్పని తిప్పలు

**అవుకు:** ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలు అరికట్టేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ పంపిణీ విధానాన్ని తీసుకొచ్చింది. దీంతో ప్రజలకు సౌలభ్యంతో పాటు, సమయం వృథా కాకుండా ఉండేది. అంతేకాకుండా ఎంతో మంది నిరుద్యోగులకు జీవనాధారం లభించింది. బనగానపల్లె నియోజకవర్గంలో 209 ప్రభుత్వ చౌక దుకాణాల పరిధిలో 88,698 రైస్ కార్డుదారులు ఉన్నారు. వీటి ద్వారా 2,59,898 మంది లబ్ధి పొందుతున్నారు. 2021 నుంచి 56 ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రాషన్ సరుకులు అందించేవారు. దూరాభారంతో పాటు వ్యయప్రయాసలు తగ్గడంతో కార్డుదారులు సంతోషంగా సరుకులు తీసుకునేవారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ అందించే ఎండీయూ వాహనాల నిర్వహణ ఖర్చుతో కూడుకున్నదని సాకు చూపి ఈ విధానాన్ని రద్దు చేసే నిర్ణయం తీసుకుంది.

కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇంటి వద్దనే రేషన్ పొందే అవకాశాన్ని కార్డుదారులు కోల్పోయారు. ఇక నుంచి చౌకదుకాణాలకు రేషన్ దుకాణాలకే వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తుండడంతో బాబు ప్రభుత్వంలో మళ్లీ కష్టాలు తప్పడంలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

### రోడ్డున పడుతున్న ఎండీయూ ఆపరేటర్లు

బనగానపల్లె నియోజకవర్గంలో ఇంటి వద్దకే రేషన్ సరుకులు తీసుకొచ్చే ఎండీయూ వాహనదారులు 56 మంది ఉన్నారు. ప్రతి వాహనానికీ ఒక ఆపరేటర్, ఒక హెల్పర్ ఉన్నారు. ఈ లెక్క ప్రకారం 56 మంది ఆపరేటర్లు, 56 మంది హెల్పర్లు ఉపాధి పొందుతున్నారు. వాహనం నిర్వహణకు ప్రతి నెలా ప్రభుత్వం రూ.21 వేలు చెల్లించేది. ఇందులో రూ.3వేలు వాహనం కంతు, రూ.3వేలు పెట్రోల్, రూ.5వేలు హెల్పర్‌కు ఇస్తారు. మిగిలిన రూ.10వేలు ఆపరేటర్ వేతనంగా తీసుకునేవారు. ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో ఆపరేటర్లు, హెల్పర్లు రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. వాటినే నమ్ముకొని జీవిస్తున్న కుటుంబాల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఇంటింటికీ ఉద్యోగం కల్పిస్తామన్న కూటమి నాయకులు ఇచ్చిన హామీని నేరవేర్చకుండా జీవానాధారంగా ఉన్న తమ ఉద్యోగాన్ని ఊడగొట్టి రోడ్డున పడేసిందని ఆపరేటర్లు, హెల్పర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకులు తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

**బనగానపల్లె నియోజకవర్గంలో వివరాలు ఇలా...**

| మండలం | రేషన్ కార్డులు | లబ్ధి దారులు | చౌక దుకాణాలు | ఎండీయూల సంఖ్య |
|---|---|---|---|---|
| అవుకు | 16,074 | 45,962 | 41 | 10 |
| బనగానపల్లె | 36,139 | 91,722 | 58 | 19 |
| కోవెలకుంట్ల | 14,064 | 39,602 | 34 | 09 |
| కొలిమిగుండ్ల | 16,227 | 47,980 | 44 | 10 |
| సంజామల | 12,062 | 34,632 | 32 | 08 |

### కంతులు ఎలా చెల్లించాలి



ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో మా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వాహనాలకు సంబంధించి నెలవారి కంతులు బ్యాంకులకు ఎలా చెల్లించాలో అర్థం కావడంలేదు. ప్రభుత్వ నిర్ణయంతో ఆపరేటర్లే కాదు, కార్డుదారులకూ ఇబ్బందులు తప్పవు. అందరినీ దృష్టిలో ఉంచుకుని ఎండీయూ వ్యవస్థపై ప్రభుత్వం పునరాలోచించాలి. తగిన నిర్ణయం తీసుకోవాలి.

–వెంకట శివ, ఎండీయూ ఆపరేటర్, అవుకు

### మా కడుపు కొట్టడం దుర్మార్గం



ఎండీయూ వాహనాన్ని నడుపుకుంటూ జీవనోపాధి పొందేవాడిని. కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో పని కోల్పోయాం. ప్రభుత్వం ఉద్యోగావకాశాలను కల్పించాల్సిందిపోయి ఎండీయూ వాహనాలతో ఉపాధి పొందుతున్న మా పొట్ట కొట్టేలా నిర్ణయం తీసుకోవడం దుర్మార్గం. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

–కేశవులు, ఎండీయూ ఆపరేటర్, గుండ్లశింగవరం

### కరోనాలోనూ సేవలందించాం



కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి సరుకులు సరఫరా చేశాం. మాకొచ్చే రూ.10 వేలతో కుటుంబాలను పోషించుకుంటూ వచ్చాం. ప్రభుత్వం అప్పగించే అన్ని బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాం. అకస్మాత్తుగా ప్రభుత్వం రేషన్ పంపిణీ వాహనాలను ఆపేస్తోంది. దీంతో మా బతుకు బండి చక్రాలు కూడా ఆగిపోయినట్లే.

–సయ్యద్ రసూల్, ఎండీయూ ఆపరేటర్, అవుకు

### ఇంటి దగ్గరే రేషన్ ఇవ్వాలి



ఇంటి వద్దకే రేషన్ సరుకులు ఇవ్వడం వల్ల మాలాంటి వారికి ఎంతో సౌలభ్యంగా ఉండేది. బియ్యం బండి ఎప్పుడు వస్తుందో సమాచారం ఇచ్చేవారు. ఇప్పుడు పనులన్నీ వదులుకుని రేషన్ షాపుల వద్దకు పరుగులు తీయాల్సి వస్తుంది. పైగా వెళ్లిన రోజే రేషన్ అందుతుందన్న నమ్మకం లేదు. ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించే పద్ధతినే కొనసాగించాలి.

–తలారి బాల చెన్నమ్మ, గృహిణి, ఓబుళాపురం

### మళ్లీ కష్టాలు తప్పేలా లేవు



గత ప్రభుత్వ హయాంలో పేదల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఇంటి వద్దకే రేషన్ ఇచ్చేవారు. మాకు ఇబ్బంది ఉండేదికాదు. కానీ ప్రసుత్త ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడమేకాకుండా ప్రజలకు ఎంతో ఉపయోగపడే బియ్యం బండ్లను తొలగించడం అన్యాయం. నాలుగు కిలోమీటర్లు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి.

–రామక్క బాయి, ఇస్రానాయక్‌తండా, అవుకు

### 15 కి.మీ వెళ్లి తెచ్చుకోవాలి



కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటికీ రేషన్ పంపిణీ రద్దు చేయడం దుర్మార్గం. ప్రజలు ఎండీయూ వాహనాల ద్వారా ఎంతో సౌకర్యవంతంగా రేషన్ పొందేవారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో స్టోర్ డీలర్ల వద్దకు వెళ్లి రేషన్ తీసుకోవాల్సిన పరిస్థితి. దాదాపు కొండల్లో 15 కి.మీ వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాలి. మాకు మళ్లీ తిప్పలు తప్పవనిపిస్తోంది.

–కంబగిరిరాముడు నాయక్, మద్రికుంటతండా

## ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం





బేతంచెర్లలో సీఐటీయూ జెండా ఆవిష్కరణ చేస్తున్న నాయకులు, డోన్‌లో..

**ప్యాపిలి:** మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో శుక్రవారం సీఐటీయూ 55వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. అనంతరం మండల డిప్యూటీ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ.. కార్మిక వర్గాన్ని ఐక్యం చేసే లక్ష్యంతో 1970 మే 30వ తేదీ సీఐటీయూ ఆవిర్భవించినట్లు తెలిపారు. కార్మికులు, రైతులు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తున్న ఘనత సీఐటీయూదే అన్నారు. సంఘం నాయకులు చెన్నకేశవులు, శ్రీనివాసులు, మద్దయ్య, దస్తగిరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- **డోన్ టౌన్:** కార్మిక వర్గానికి అండ సీఐటీయూ జెండా అని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శివరామ్, డోన్ మండల కార్యదర్శి భాస్కర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సంఘం కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. పాలకులు కార్మికుల చట్టాలను నిర్వీర్యం చేస్తూ పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. సంఘం నాయకులు నక్కి శ్రీకాంత్, చిన్న రహిమాన్, చంద్రశేఖర్ రెడ్డి, రామబుగ్గడు, శేఖర్, కుల్లాయప్ప పాల్గొన్నారు.
- **బేతంచెర్ల:** కార్మిక హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం ఆవరణంలో జెండాను ఆవిష్కరించారు. హక్కుల సాధనకు కార్మికులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు.

## కంటైనర్‌లో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**డోన్ టౌన్:** బెంగళూరు నుంచి ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాకు వివిధ రకాల కుర్చీల లోడుతో వెళుతున్న మినీ కంటైనర్ శుక్రవారం డోన్ విజయభాస్కర్‌రెడ్డి నగర్ వద్ద అగ్ని ప్రమాదానికి గురైంది. కంటైనర్ మరమ్మతులకు గురికావడంతో జాతీయ రహదారిపై ఉన్న వెల్డింగ్ షాప్ వద్ద తీసుకెళ్లారు. వెల్డింగ్ పనుల కారణంగా నిప్పు రవ్వలు లారీలో ఉన్న వస్తువులపై పడి మంటలు వ్యాపించాయి. అందులో ఉన్న వస్తువులు కాలిపోయి రూ.8 లక్షలు నష్టం వాటిల్లింది. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే అందులోని కుర్చీలు కాలిపోయాయి.

## సిద్ధేశ్వరం బహిరంగ సభకు తరలిరావాలి

**కోవెలకుంట్ల:** రాయలసీమ ప్రాంతానికి తాగు, సాగునీటి వనరు అయిన సిద్ధేశ్వరం అలుగు సాధన కోసం నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు తరలి రావాలని రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని సౌదరదిన్నెలో ఆ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సంగమేశ్వరం వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా అహల్యభాయి జయంతి

**కోవెలకుంట్ల:** పట్టణంలోని పాండురంగస్వామి దేవాలయ ఆవరణలో పుణ్యశ్లోక రాజమాతగా పేరుగాంచిన అహల్యభాయి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జిగాళ్ల లింగన్న ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శత్రువులు ధ్వంసం చేసిన వందలాది దేవాలయాలను పునర్నిర్మాణం చేయడమే కాకుండా విద్యాలయాలు ఏర్పాటు చేశారని కొనియాడారు. పార్టీ మండల అధ్యక్షుడు లోకేశ్వరరెడ్డి, నాయకులు వెంకటసుబ్బయ్య, సుబ్బయ్య, వలి పాల్గొన్నారు.

### పాఠశాలలో హెచ్‌ఎం పోస్టుల భర్తీ

**కొలిమిగుండ్ల:** ఉపాధ్యాయ పదోన్నతుల్లో భాగంగా మండలంలో పలు ఉన్నత పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులు భర్తీ అయ్యాయి. కొన్ని పాఠశాలలకు చాలా రోజుల నుంచి హెచ్‌ఎం పోస్టులు ఉండేవికావు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి భర్తీ చేశారు. మండలంలోని ఎర్రగుడి, తిమ్మనాయనిపేట, కొలిమిగుండ్ల, బెలుం, అంకిరెడ్డిపల్లె, పెట్నికోట ఉన్నత పాఠశాలకు హెచ్‌ఎంలను నియమించారు. అయితే కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలకు అంకిరెడ్డిపల్లె మెయిన్ ప్రాథమిక పాఠశాల నుంచి పదోన్నతి పొందిన జయరామిరెడ్డి జూన్ నెల చివరిలో పదవీ విరమణ పొందనున్నారు. దీంతో ఆ పాఠశాలలో మళ్లీ ఇన్‌చార్జ్ హెచ్‌ఎంను నియమించాల్సి వస్తుంది.

### 4 నుంచి ఆలయ వార్షికోత్సవం

**ప్యాపిలి:** పట్టణంలోని హరిహర అయ్యప్పస్వామి ఆలయం 19వ వార్షికోత్సవాన్ని జూన్ 4, 5 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 4వ తేదీ గణపతిపూజ, పుణ్యాహవాచనం, గణపతి హోమం, సర్వదేవతల అభిషేకం, అయ్యప్పస్వామి గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 5వ తేదీ సర్వదేవతల అభిషేకం, లలితాదేవి సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, హనుమాన్ చాలీసా పారాయణం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదే రోజు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

### వాహనాల తనిఖీ

**కోవెలకుంట్ల:** కోవెలకుంట్ల–అవుకు ఆర్‌అండ్‌బీ రహదారిలో శుక్రవారం ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, జమ్మలమడుగు, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

### డివైడర్‌ను ఢీకొని స్కూటరిస్టుకు గాయాలు

**బేతంచెర్ల:** పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన గణేష్ అనే యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయాలు కావడంతో శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అలాగే బలపాలపల్లె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో యువకుడికి త్రీవ గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బేతంచెర్ల ఆస్పత్రికి తీసుకెళ్లారు.

### ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**బేతంచెర్ల:** పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. దుర్గాపేట కాలనీకి చెందిన పెద్ద వెంకటస్వామి, నాగమ్మ దంపతుల కుమారుడు నడ్డి వెంకటేశ్వర్లు(30) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా మానసిక పరిస్థితి సరిగా లేదు. ఈ క్రమంలో మద్యం మత్తులో శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో అల్లాబకాష్ దర్గా వెనుక ఉన్న తన అన్న నడ్డి తిరుమలేష్ ఇంటి సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు.

## కేంద్ర మద్దతు ధర ఆమోదయోగ్యంగా లేదు



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న

**బనగానపల్లె:** రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర గిట్టుబాటుగా లేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న అన్నారు. శుక్రవారం మండలంలోని నందివర్గం గ్రామ రైతులతో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ కంపెనీలకు వత్తాసుపలికే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. 2025–26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరితో పాటు 14 రకాల పంటలకు కేంద్రం మద్దతు ధర ప్రకటించిందని.. అయితే ఇది ఆమోదయోగ్యంగా లేదని తెలిపారు. అనంతరం నందివర్గం నూతన రైతు సంఘం ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా కొండారెడ్డి, కోకన్వీనర్‌గా బుజ్జిబాబు, సభ్యులుగా రంగస్వామి, పల్లె శివనాగిరెడ్డి, పాణ్యం శ్రీనివాసులు, లక్ష్మయ్య చిన్న షేక్షావలిని నియమించారు.

### యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**డోన్ టౌన్:** ఎన్నో వ్యాధులను నయం చేసే శక్తి యోగా, ధ్యానానికి ఉన్నాయని.. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ గ్రేస్ సెలిస్టియల్, గీతా యోగసనం సంఘం గురూజీ రాంపుల్లయ్య అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని కేవీఎస్ కాలనీ పార్కులో గీతా యోగాసన సంఘం సభ్యులకు యోగాసనాలు, ధ్యానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

## వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటి గోడ కూల్చివేత



వెంకటరామిరెడ్డి ఇంటి గోడను కూల్చిన దృశ్యం

**సంజామల:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు దౌరన్యాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. మండల పరిధిలోని కమలపురి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ముక్కమల్ల వెంకట రామిరెడ్డి ఇంటికి ఓ వైపు గోడపారును మొత్తం కూల్చేశారు. బాధితుడు వెంకట రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దాట్ల సహదేవ్‌రెడ్డి గత నెల 18న ఊరిలో లేని సమయంలో ఇంటి గోడను కూల్చేశాడు. అతను నూతన ఇల్లును నిర్మించుకోవాలని ఇద్దరి మధ్య ఉన్న గోడ పారును నేలమట్టం చేశాడు. దాదాపు 40 రోజుల నుంచి పోలీసుల చుట్టూ తిరుగుతున్న పోలీసులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తునాన్నాడు. అతనిపై ఫిర్యాదు చేసిన కేసు నమోదు చేయడం లేదని వాపోతున్నాడు.దాదాపు ఇల్లు గోడ,బాత్‌రూం కూల్చడం వలన దాదాపు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. అధికారం ఉందని కూటమి నాయకులు దౌర్జన్యాంగా ఇల్లు కూల్చివేయడం అన్యాయం చేశాడని బాధితుడు వాపోతున్నాడు. ఉన్నత అధికారుల స్పందించి న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

## వీడని వర్షం



కోవెలకుంట్లలో కురుస్తున్న వర్షం

**కోవెలకుంట్ల:** నైరుతి రుతు పవనాల ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం సబ్ డివిజన్‌లోని ఉయ్యాలవాడ మండలంలో 29.6 మి.మీ., కొలిమిగుండ్లలో 12.6, కోవెలకుంట్లలో 12.2 మి.మీ, సంజామలలో 9.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండగా సీజన్‌కు ముందే వర్షాలు అనుకూలంగా మారడంతో రైతులు ఊరట చెందుతున్నారు. వివిధ మండలాల్లో వారం రోజుల నుంచి మొక్కజొన్న, పత్తి విత్తన పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వరణుడు తెరపిస్తే వ్యవసాయ పనులు ఊపందుకోనున్నాయి.